రోడ్డుపైనే చెత్తాచెదారం

- నగరంలోని 48వ డివిజన్‌లో అధ్వానంగా పరిసరాలు
- ఇబ్బందుల్లో ప్రజలు
- పట్టించుకోని అధికారులు


48వ డివిజన్‌లో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

నిజామాబాద్‌నాగారం: నగరంలో చెత్త సేకరణ అంతంత మాత్రంగానే జరగడంతో పల డివిజన్లలో రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోతుంది. దీంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేయాల్సి ఉన్నా, నిర్లక్ష్యం వహించడంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. కొన్ని ప్రాంతాలకు వారం రోజుల వరకు కూడా చెత్తను తీసుకోవడానికి సిబ్బంది రావడం లేదు. దీంతో పరిసరాలు అధ్వానంగా మారి, దుర్గంధాన్ని వెదజల్లుతోందని పలువురు పేర్కొంటున్నారు.

ఇదీ పరిస్థితి..

నగరంలోని 48వ డివిజన్‌లో చెత్తను రోడ్లపైన అలాగే వదిలివేశారు. ఈ డివిజన్ పరిధిలో ప్రతి నిత్యం చెత్తసేకరణ చేయాల్సి ఉన్నా, గత పదిరోజులుగా చెత్తను తరలించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి చెత్త రోడ్డుపైనే ఉండడంతో పరిసరాల్లో దుర్వాసన వెదజల్లుతుంది. శానిటేషన్‌కు సంబంధించిన అధికారులు చెత్త తరలింపు విషయంలో సక్రమంగా పర్యవేక్షణ చేయడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ప్రతినిత్యం చెత్త వాహనాలు కేవలం రోడ్డు మీదే అటు, ఇటు తిరుగుతున్నాయని, కాలనీల్లోకి రావడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెత్త తరలింపు విషయంలో పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నగరంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

‘చెత్త’ వాహనాలు రావడం లేదు..



నగరంలో చెత్తను మున్సిపల్ సిబ్బంది సక్రమంగా తొలగించడం లేదు. దీంతో రోడ్డు మీద వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. డివిజన్‌లో 10 రోజులుగా చెత్తను తీసుకెళ్లడానికి వాహనాలు రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ప్రతినిత్యం చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

– సుధీర్‌సింగ్, వైద్యుడు, పర్యావరణవేత్త, నిజామాబాద్

సర్పంచులను ఇన్‌చార్జీలుగా కొనసాగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న గోర్త రాజేందర్

జక్రాన్‌పల్లి: ఈ నెలాఖరుకు సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుండటంతో మళ్లీ ఎన్నికలు నిర్వహించే వరకు ప్రస్తుత సర్పంచులను ఇన్‌చార్జీలుగా కొనసాగించాలని జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు గోర్త రాజేందర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ప్రొఫెసర్లు కోదండరాం, హరగోపాల్, పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, తెలంగాణ సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు భూమన్న యాదవ్‌ల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో గోర్త రాజేందర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌లు ఎన్నో విధాలుగా ఇబ్బందులకు గురికావడం జరిగిందన్నారు. సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు రాక అవస్థలు పడ్డారన్నారు. ఇప్పటికీ వారికి రూ.లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సర్పంచ్‌లకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. సర్పంచ్‌లకు సకాలంలో బిల్లులు చెల్లించి వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు.

తాగునీటి సరఫరాలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి


మాట్లాడుతున్న మేయర్ నీతూకిరణ్

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నీటిని కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ నీతూకిరణ్ అధికారులకు సూచించారు. నగరంలోని మున్సిపల్ కార్యాలయంలోగల మేయర్ ఛాంబర్‌లో బుధవారం ఆమె మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ.. పారిశ్శుధ్య పనులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, చెత్త నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా చెత్త వాహనాలను విధిగా కాలనీలలో తిప్పాలని సిబ్బందిని ఆదేశించారు. ఎగ్జిక్యుటివ్ ఇంజనీర్ మురళి మోహన్‌రెడ్డి, ఇంజనీర్లు మురళి, శంకర్, సల్మాన్ ఖాన్, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో సాజిద్ అలీ, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాస్, సల్మాన్‌రాజ్, ప్రశాంత్, శ్రీకాంత్, సునీల్, మహిపాల్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి



నిజామాబాద్‌నాగారం: మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (బీఎల్‌టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12న నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. యూనియన్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, నాయకులు హరీష్, సహదేవ్ పాల్గొన్నారు.

ఓబన్న జయంతి వేడుకలకు తరలిరండి




నిజామాబాద్‌నాగారం: నగరంలో నేడు నిర్వహించనున్న వడ్డెర ఓబన్న జయంతి వేడుకలకు తరలిరావాలని వడ్డెర వృత్తిదారుల సంఘ నాయకులు పిలుపునిచ్చారు. నగరంలో బుధవారం సంఘం జిల్లా కమిటీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఓబన్న 217 జయంతిని అధికారికంగా నిర్వహించాలని సర్క్యూలర్ జారీ చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఇడగొట్టి సాయిలు అన్నారు. నాందేవ్‌వాడ వృత్తిదారుల కార్యాలయంలో ఉదయం నిర్వహించనున్న ఉత్సవాల్లో ప్రజలు తరలిరావాలన్నారు. సంఘ ప్రతినిధులు వెంకటేష్, బండారి ఎల్లయ్య, గోగుల చిన్న సాయిలు, ఎల్లయ్య ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలి



మోపాల్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థుల సంఖ్య, కేజీబీవీలో నెలకొన్న సమస్యలు, ఇతరత్ర అంశాలపై ఎస్‌వో శ్రీవేణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతి మూడు నెలలకోసారి 160 అంశాలతో కూడిన వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అందులో భాగంగానే కేజీబీవీని తనిఖీ చేశామని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి



నిజామాబాద్‌నాగారం: నగరంలోని రోటరీనగర్ ఫేస్–2 ముఖద్వారంలో అక్రమ నిర్మాణం చేశారని వెంటనే తొలగించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు బుధవారం మున్సిపల్ కమిషనర్ మందమకరందుకు విన్నవించారు. అనుమతి లేకుండా రోడ్డుపై అక్రమంగా షెడ్డు నిర్మాణం చేసినట్లు తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. స్థానికులు చంద్రమోహన్, బంటురామ్‌కుమార్, రాజు, సాయిలు, ప్రభాకర్ తదితరులున్నారు.

కొనసాగుతున్న ‘ప్రజాపాలన’ ఆన్‌లైన్ ప్రక్రియ



నిజామాబాద్ రూరల్: రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ఎంపీడీవో మల్లేష్, తహసీల్దార్ అనురుద్ ఆధ్వర్యంలో దరఖాస్తుల పరిశీలనతో పాటు అన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు బుధవారం వెల్లడించారు. ఈ అన్‌లైన్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేస్తామని అధికారులు పేర్కొన్నారు. ఎంపీవో మధురిమ, మండల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మైనార్టీలకు నిధులు కేటాయించాలి


మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

ఖలీల్‌వాడి: మైనార్టీలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదని, వెంటనే స్పందించి నిధులు కేటాయించాలని ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ఉర్దూమీడియం ఎస్సెస్సీ విద్యార్థులకు ఎంఐఎం తరఫున ఆల్ ఇన్ వన్ గైడ్‌లను ఆయన అందజేశారు. అనంతరం ఒవైసీ మాట్లాడుతూ.. ఆలీఘడ్ యూనివర్సిటీకి మోదీ ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదన్నారు. దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉద్యోగాలు, విద్యాసంస్థలలో సీట్ల రిజర్వేషన్‌ను 80శాతం చేయడానికి మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో నాలుగు శాతం ముస్లిం ఉద్యోగలు ఖాళీలు ఉన్నాయని, వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు షకీల్, డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

నగరంలో ‘జైపూర్ ఫుట్’ శిబిరం


వికలాంగుడికి కృత్రిమ కాలు అమర్చుతున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

నిజామాబాద్ సిటీ: నగరంలోని రోటరీ కృత్రిమ అభయ కేంద్రంలో బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, నిజామాబాద్ రోటరీ సర్వీస్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కృత్రిమ జైపూర్ ఫుట్ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది, రోటరీ ట్రస్ట్ మాజీ చైర్మన్ హరిప్రసాద్ హాజరై, మాట్లాడారు. అనివార్య కారణాలతో కాలు కోల్పోయిన వారికి రోటరీ సంస్థ ఉచితంగా కృత్రిమంగా తయారు చేసిన జైపూర్ ఫుట్‌ను అందిస్తూ వారి జీవితాలకు నమ్మకం కల్పిస్తుందని అన్నారు. 2009లో ఏర్పాటు చేసిన ఈ కృత్రిమ కేంద్రం ద్వారా ఇప్పటివరకు రెండు వేలకు పైగా బాధితులకు జైపూర్ ఫుట్‌లను అమర్చటం జరిగిందన్నారు. క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమారి, ట్రస్ట్ చైర్మన్ వేద్ ప్రకాష్ మిట్టల్, కోశాధికారి జ్ఞాన ప్రకాష్, శ్రీనివాసరావు చంద్రసేన్ రెడ్డి, సుధీర్ గుప్తా పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

చక్రంగుడిలో ధనుర్మాస ఉత్సవాలు



నిజామాబాద్ సిటీ: నగరంలోని బ్రహ్మపురి చక్రం గుడిలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో వేంకటేశ్వరస్వామి వారిని వివిధ రకాల పూలతో అలంకరించి పూలాంగి సేవా నిర్వహించారు. అనంతరం వేద పండితుడు వేద పారాయణం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు హయగ్రీవ ఆచార్య, నరసింహమూర్తి, అమిత్‌కుమార్ ఆచార్య, అజిత్ కుమార్ ఆచార్య, నాగరాజా ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల ఏర్పాటుపై విచారణ

నిజామాబాద్‌నాగారం: నగరంలో అక్రమంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై మున్సిపల్ కమిషనర్ మందమకరందు బుధవారం విచారణకు ఆదేశాలు జారీ చేశారు. నగరంలో నెలకొన్న ఫ్లెక్సీల వివాదంపై ఇటీవల సాక్షి దినపత్రికలో ‘నగరంలో ఫ్లెక్సీల వివాదం’ పేరిట కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి కమిషనర్ స్పందించారు. మున్సిపల్ అసోసియేషన్ పేరుతో ఎన్ని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారో, ఎక్కడెక్కడో ఏర్పాటు చేశారో సంఖ్యతోపాటు, స్పాన్సర్లు, ఖర్చుల వివరాలు అందించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం నగరంలో సంబంధిత ఫ్లెక్సీలను సిబ్బంది తొలగింపజేశారు.

అక్రమ నిర్మాణాలపై సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: నగరంలో అక్రమ నిర్మాణాలపై ఇటీవల సాక్షి దినపత్రికలో ‘అక్రమ నిర్మాణాల జోరు’ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో సీడీఏఎంఏ అధికారులు సీరియస్ అయి, వెంటనే విచారణ జరిపి, నివేదిక అందజేయాలని డీసీపీ శ్యామ్, టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని అరుధంతీనగర్‌లో నిర్మాణం జరుగుతున్న ప్రాంతానికి అధికారులు వెళ్లి తనిఖీ చేశారు. సంబంధిత డాక్యుమెంట్లు, అనుమతి పత్రాలు సమర్పించాలని నిర్మాణదారులకు నోటీసు అందజేసినట్లు టీపీఎస్ అనుపమ తెలిపారు. పూర్తిస్థాయి నివేదికను అతి త్వరలో అందజేయనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జికి సన్మానం



ఖలీల్‌వాడి: హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో బుధవారం తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీని జిల్లా కాంగ్రెస్ నేతలు కలిసి సన్మానం చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, నాయకులు బాడ్సి శేఖర్‌గౌడ్, కేశ వేణు, గడుగు గంగాధర్ ఉన్నారు.

ఎల్‌ఐసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిజామాబాద్‌నాగారం: ఎల్‌ఐసీ (భారతీయ జీవిత బీమా సంస్థ)ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు బుధవారం ఎల్లమ్మగుట్టలోని ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. జేఏసీ నాయకులు సక్కి సత్యనారాయణ, గంగోని శ్రీధర్, చంద్రశేఖర్ పవర్ మాట్లాడుతూ.. తక్షణమే ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని, యాజమాన్యం కాలయాపన చేసే విధానాన్ని ఎండగడుతూ ఈ సమ్మె చేసినట్లు తెలిపారు. న్యూ పెన్షన్ స్కీంలో యాజమాన్యం వాట 14శాతానికి పెంచాలని, పాత పెన్షన్ విధానాల వల్ల ఉద్యోగులందరికీ న్యాయం జరుగుతుందని వివరించారు. యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగులందరూ ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎల్‌ఐసీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి తక్షణమే నూతన రిక్రూట్‌మెంట్ చేపట్టాలన్నారు. బ్రాంచ్ అధ్యక్షుడు సక్కి ఆనంద్ కుమార్, కార్యదర్శి సక్కి సత్యనారాయణ, శివశంకర్, సామ్రాట్, గంగాధర్, కల్పన, గంగోని శ్రీధర్, శ్రీనివాస్, గోపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఘనంగా విశ్వహిందీ దివస్



సిరికొండ: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్, కిడ్స్‌పార్క్ బడుల్లో బుధవారం విశ్వ హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు హిందీలో కథలు చెప్పే పోటీలు, పాటలు, ఉపన్యాస, కవితల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పీజీహెచ్‌ఎం సతీష్, గంగాధర్, మోతీలాల్, అన్నపూర్ణ, సునీత, యూసుఫ్‌ఖాన్, అబ్బయ్య, జమున, రాజమణి పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ



నిజామాబాద్‌నాగారం: నగరంలో బుధవారం ఫుట్‌బాల్ క్రీడాకారులకు డాక్టర్ కవితరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ప్రెసిడెంట్ ఫారుఖ్, జావిద్, జాహ్నవీ, చైతన్య, శ్రీజ, జట్ల కెప్టెన్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



సుభాష్‌నగర్: నగరంలో బుధవారం నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని సంస్థ ఉమ్మడి జిల్లా చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పాలకవర్గ సభ్యులు, బ్యాంకు సిబ్బందికి క్యాలెండర్లు, డైరీలను అందజేశారు. డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, గోర్కంటి లింగం, సాయికుమార్, శరత్, ఆనంద్, శాంతిశ్వర్ పటేల్, భూమన్న, మోతీలాల్, నాబార్డ్ డీడీఎం ప్రవీణ్‌కుమార్, డీసీవో సింహాచలం, బ్యాంకు సీఈఓ నాగభూషణం, డీజీఎంలు, ఏజీఎంలు పాల్గొన్నారు.

హెల్త్ సబ్‌సెంటర్‌కు సామగ్రి..


సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్ ఆరోగ్య ఉప కేంద్రానికి బుధవారం గాదారి మహేష్‌రెడ్డి సామగ్రిని వితరణ చేశారు. మందులు ఇతర సామాగ్రి పెట్టుకోవడానికి నాలుగు ర్యాకులను అందించారు. మెడికల్ ఆఫీసర్ అరవింద్, గ్రామ పెద్దలు గాదారి నర్సారెడ్డి, జాగిరపు నర్సారెడ్డి, రాంరెడ్డి, సీహెచ్‌వో అనంత్‌రావు, రమేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలి



ధర్పల్లి: విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి, ఏకాగ్రతతో చదివితే మంచి మార్కులు సాధించవచ్చని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని లిటిల్‌హార్ట్స్ పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు ఇన్‌స్పైర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణులు, ఎంఈవో విద్యార్థులకు పలు సలహాలు, సూచలను అందించారు. ఇంపాక్ట్ ట్రైనర్స్ సునీల్, మహేష్, ప్రిన్సిపాల్ రజియోద్దిన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



నిజామాబాద్ రూరల్/నిజామాబాద్‌నాగారం: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో నగరంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి శివరాత్రి చైతన్య బంగారు పతకం సాధించారు. దీంతో బుధవారం పాఠశాలలో సదరు విద్యార్థిని పాఠశాల యాజమాన్యం అభినందించింది. స్కూల్ జనరల్ మేనేజర్ నాగేంద్ర, చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యా, ఏజీఎం జితెందర్, ప్రిన్సిపాల్ రామకృష్ణ, డీన్ క్రాం, కో–ఆర్డినేటర్ నరేందర్ ఉన్నారు.

పీఎస్‌లో ఫిర్యాదు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని 8వ డివిజన్‌కు చెందిన కార్పొరేటర్ విక్రమ్‌గౌడ్ తనకు ప్రాణహాని ఉందని 5వ టౌన్‌పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. నగరంలోని కిషన్, రాఘవేందర్, రౌడీషీటర్ వెంకటేశ్‌లు తనను ఈనెల 8న వెంబడించారని, వీళ్ల నుంచి ప్రాణహని ఉందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

వాతావరణంలో మార్పులు.. జాగ్రత్తలు


రూరల్ మండలంలో కమ్ముకున్న మబ్బులు

నిజామాబాద్ రూరల్: జిల్లాలో గత రెండు రోజులుగా వాతావరణంలో మార్పుల కారణంగా మొత్తం మబ్బులు కమ్మేశాయి. అలాగే బుధవారం జిల్లాకేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో అక్కడక్కడ చిరుజల్లులు సైతం కురిశాయి. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణి కారణంగా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వర్ష సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈక్రమంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా ఈదురుగాలులు వీస్తుండడంతో పిల్లలు వయోవృద్ధులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులతో పిల్లలకు, పెద్దలకు వైరల్ ఫీవర్ వచ్చే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. రానున్న మూడు రోజులు ఇదే పరిస్థితి నెలకొంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

రైతులు భయపడొద్దు..

జిల్లాలో వరితో పాటు ఆరుతడి పంటలు వేసిన రైతులు ఈ వాతవరణ మార్పులకు ఎలాంటి భయాందోళన చెందాల్సిన పనిలేదు. ఇలాంటి మార్పులు సహజం. రైతులు ఈదురు గాలులకు గురికాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. పంటల పట్ల కూడా తగిన జాగ్రత్తలు పాటించాలి.

–వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, నిజామాబాద్

పిల్లలు జాగ్రత్తలు పాటించాలి..

గత రెండు రోజులుగా జిల్లాలో కారు మబ్బులు కమ్ముకున్నాయి. ఈనేపథ్యంలో చల్లని ఈదురుగాల్లు వీస్తున్నాయి. దీంతో నవజాత శిశువు నుంచి మొదలు కొని యుక్తవయసు బాలలందరూ ఉన్ని దుస్తులు ధరించాలి. లేదంటే విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది.

–శ్రీనివాస్, పీడియాట్రిక్ వైద్యుడు

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	14	20	గాజరుగడ్డ	45	60
బెండకాయ	60	90	పచ్చిమిర్చి	40	70
బీరకాయ	60	90	దోసకాయ	25	50
దొండకాయ	45	60	ఆలుగడ్డ	18	30
బీర్నీసుకాయ	30	70	గోబిగడ్డ	25	50
కాకరకాయ	60	80	గోబిపువ్వు	40	60
వంకాయ	60	90	బీట్‌రూట్	30	60
పాలకూర	25	50	కరివేపాకు	60	80
మెంతికూర	30	50	చామగడ్డ	50	70
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	50	70
పుదీనా	50	80	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	63,650	వెండి (కిలో)	75,600
22 క్యారెట్స్	58,668		

– నిజామాబాద్ బిజినెస్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)	
స్క్రీన్-2	డెవిల్(తెలుగు) 10.45, 4.35
	హాయ్ నాన్న(తెలుగు) 1.35
	సలార్(తెలుగు) 7.20, 10.40
స్క్రీన్-3	సలార్(తెలుగు) 1.25, 4.35
	డెవిల్(తెలుగు) 7.45, 10.40
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)	
స్క్రీన్-1	సలార్(తెలుగు)11.00,2.35,6.10, 9.45
స్క్రీన్-2	సలార్(హిందీ) 11.05, 6.40, 10.15
	యానిమల్(హిందీ) 2.40
స్క్రీన్-3	డంకీ(హిందీ) 12.40, 7.15
	హాయ్ నాన్న(తెలుగు) 4.00, 10.35
స్క్రీన్-4	డెవిల్(తెలుగు) 12.50, 10.10
దేవి	డెవిల్(తెలుగు)
నటరాజ్	సలార్(హిందీ)
లలితామహల్	హాయ్ నాన్న(తెలుగు)
విజయ్	సలార్(తెలుగు)